# బలివాడ కాంతారావు జన్మభూమి నవల – రాజకీయవిలువలు



డా॥ వెలిచేటి వెంకటేశ్వరరావు
చరవాణి: 9603883885
email: velichettivenkataswararao7@gmail.com,

మానవజన్మ చాలా దుర్లభమైంది ఈ జన్మను సార్ధకం చేసుకోవటానికి అహర్నిశలు కృషిచేయాలి. ఈ జన్మను ధన్యం చేసుకోవటానికి పరోపకార దృక్పథం కలిగి ఉండాలి. ఈసేవాదృక్పథం కలిగి ఉండటం ద్వారా మానవజీవితానికి సార్ధకత లభిస్తుంది. మానవ జీవితం చాలా విలువైంది. ఇటువంటి మానవ జీవితంలో అనేక విలువలు గోచరిస్తాయి. ఈవిలువలే మానవత్వాన్ని చాటిచెబుతాయి. విశాల భావాలను అలవరుస్తాయి. అటువంటి విశాలభావాలు కలిగిన వారికి లోకమంతా ఒక ఇల్లుగా కనబడుతుంది. లోకంలోని వారందరూ తన రక్త సంబంధులుగా భావిస్తారు. మానవీయ విలువలను మనుష్యుల హృదయాలలో చిరస్మరణీయంగా ఉంచుటకు అనేకమంది కవులు రచయితలు అనేక రచనలు చేస్తునే ఉన్నారు. వారి రచనలు ద్వారా సమాజాన్ని ఒక త్రాటిపైకి తెస్తున్నారు. ఈకృషిలోభాగంగా బలికాంతారావు గారు కూడా అనేక రచనలు చేసారు. వాటిలో ‘జన్మభూమి’ నవల ఒకటి.

ఈ జన్మభూమి నవలలో మానవతా, రాజకీయవిలువలు మనకు కనబడతాయి. సీతారామయ్యకు లేకలేక పదిసంవత్సరాల తరువాత వారసుడు పుడతాడు శిశువు పుట్టగానే తల్లి పురిటిలోనే సంధికొడుతుంది. సీతారామయ్య గొప్ప మానవతా విలువలు కలవాడు ఖద్దరు దుస్తులు, బుట్టతలపాగపెట్టుకుని ప్రత్యేక అలంకరణ చేసుకున్నా అందరిలో కలిసిపోయే తత్వం గలవాడు. అందరి బాధలను పంచుకునే సహృద భావం కలవాడు. కోరికలను తన ఆధీనంలో పెట్టుకొనేవాడు. హిందువుడు అనే గర్వం కలవాడు. ఇటువంటి విలువలు కలిగిన మహోన్నత వ్యక్తిత్వం గలవాడు సీతారామయ్య.

సీతారామయ్య ఎంత సహృదయుడో తనకొడుకుని కూడా అలాగే పెంచాలన్న ఆదర్శభావాలు కలవాడు. అందుకే భార్యచనిపోయినా ఇంకో పెళ్ళిచేసుకోకుండా ఆస్థిపాస్తులు, తన ఆలోచనలూ, అవకాశాలు మొత్తం అన్నీ తన కొడుకు ప్రభాత్ పెంపకంకోసం, చదువుకోసం సుఖంకోసం సమాయత్తపరిచాడు. చిన్న వయస్సులో ప్రభాత్‌కి ఎన్నో సంశయాలు వచ్చేవి. వాటిని గురించి తండ్రిని ప్రశ్నిస్తే “ఆలోచించు నీకే సమాధానం దొరకుతుందని” చెప్పాడు. అలా చిన్నవయస్సులోనే ఆలోచించమని మార్గం తెరిచాడు సీతారామయ్య. సీతారామయ్య వంటి ఆదర్శభావాలు కలిగిన తల్లిదండ్రులుంటే పిల్లలు ప్రయోజకులై ఘనవిజయాలు సాధిస్తారు.

ప్రభాత్ తండ్రిని అనుసరిస్తూ తండ్రివంటి ఉపకార బుద్దిని అలవాటు చేసుకున్నాడు. ఇంటిదగ్గరలో ఉన్న పాకల్లో నగ్నంగా యెముకల గూడుల్లా వున్న పిల్లల మధ్యకు పోయేవాడు. తాను తినకుండా వాళ్ళకుపెట్టడం అలవాటు చేసుకున్నాడు. బడిలో టీచర్ ఏదినీకు సౌఖ్యానిస్తుంది అని ప్రశ్నించగా మిగతాపిల్లలు వేరు వేరు సమాధానాలు చెప్పారు. ప్రభాత్ దగ్గరకు వచ్చేసరికి ‘మానవసేవ’ అని చెప్పాడు. ఈ సమాధానం ద్వారా ప్రభాత్ చిన్న తనం నుండి విశాల భావాలు కలవాడని మనకు తెలుస్తుంది. ప్రతీ విద్యార్ధి ప్రభాత్ విధంగా ఆలోచిస్తే రేపటి భవిష్యత్ బంగారుబాట అవుతుంది. ప్రభాత్ చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందిన ఉ

పాధ్యాయుడు "నువ్వే వాళ్లందరికీ నాయకుడిగా వుండతగ్గవాడివి" అని అన్నాడు. అంతటితో వూరుకోకుండా 'ప్రభాత్' గురించి ఒక వ్యాసం రాసి తీసుకుని రండనిచెప్పాడు ఆపొగడ్త ప్రభాత్‌లో ఒక గొప్ప సంచలనం కలిగించింది. పిల్లల ఉండే గొప్ప లక్షణాలను గుర్తించి వారిని చైతన్య పరిచే ఉపాధ్యాయులు నేటితరానికి ఎంతైనా అవసరమని  ఈ సన్నివేశం తెలుపుతుంది.

ఉపాధ్యాయుడు ప్రభాత్‌లో చిన్న తనంలోనే గొప్ప నాయకుడిని చూసాడు. ఆపొగడ్త ప్రభాత్ జీవిత లక్ష్యనికి చుక్కాని అయ్యింది. ప్రభాత్ ఆలోచనావిధానంలో తీవ్రమార్పులు సంభవించాయి. దేశంలో సుఖం కోసం యెవరేం చేస్తుంటారో? వీళ్ళందరినీ సుఖపెట్టడమే నాయకుడి బాధ్యత. అదేమానవసేవ. దీనికి కావలసిన దీక్ష లేకపోతే తను నాయకుడు కాలేనని తట్టింది. ఈ ఆలోచన తరువాత భవిష్యత్ జీవితానికి నాందిపలికింది. మంచిచెడ్డలు విచక్షణాజ్ఞానం పెంపొందించుకోవటం ప్రభాత్ అలవాటు చేసుకున్నాడు. తరగతికి నాయకుడు నయ్యానని అహంకారానికి తావివ్వలేదు.ఇటువంటి శుభలక్షణాలు కలిగిన పిల్లలు వల్ల తల్లిదండ్రులకు గొప్ప పేరు ప్రఖ్యాతలు కలుగుతాయి.

ప్రభాత్ కాలేజీకి వెళ్ళిన తరువాత తనకాళ్ళమీద తాను నిల్చోవాలని ఆలోచనపుట్టింది. ఈనాటిమనుష్యుల దుస్థితికి కారణం నిన్నటి నాయకులు పట్టించుకోకపోవటమేనని ప్రభాత్ పాత్రద్వారా రచయిత సమాజానికి తెలిపారు. ప్రజాసేవకుడు జ్ఞానహీనుడైతే సమాజాన్ని కీడులో ముంచేస్తాడు. కాబట్టి రెండు విధాలుగా జ్ఞానార్జన చేయాలని ప్రభాత్ భావించాడు ఒకటి రాజకీయ గురువు వెంటపడి అతని అనుభవాలను పంచుకోవటం రెండు ఈవిశాల భారతావనిలో ప్రజల మధ్యపడివాళ్ళనే గురువులుగా చేసుకోవటం. అని ఆలోచించాడు. ఇలా ఆలోచించే రాజకీయ నాయకులు ఈనాడు ఎంతమంది ఉన్నారని చూసే ప్రశ్నమాత్రమే మిగులుతుంది 'ప్రశ్నించటంద్వారానే మనిషి పురోగమించాడని ప్రభాత్ తన తండ్రితో  అంటాడు. ఈమాటమానవవికాసానికి కారణం వెతుకుతుంది. మానవుడు అభివృద్ధి చెందాలంటే తన అంతరాత్మను తాను ప్రశ్నించుకోవాలి. సమాజాన్ని ప్రశ్నించాలి. సోక్రటీస్ ఆనాడు ప్రశ్నించారు కాబట్టి ప్రజలో గొప్ప చైతన్య ప్రవాహతీసుకుని రాగలిగారు. గొప్పశిష్యులను తయారు చేయగలిగారు. ప్రశ్నించుకోవటం వల్ల మానవుడు చైతన్య మూర్తి అవుతాడు.

ప్రభాత్ అనేకమంది రాజకీయ నాయకుల ఉపన్యాసాలు వినేవాడు. చదువుకి సలాంకొట్టి రాజకీయాలను వంటబట్టించుకున్నాడు. అనేక మంది నాయకులను ప్రత్యక్షంగా కలిసాడు. వారిని ప్రశ్నించగా వారు తెల్ల ముఖాలు వేసుకుని చూడటం మొదలుపెట్టారు. సాంప్రదాయం పేరిట మూఢనమ్మకాలను ఇంకాపార ద్రోలలేకపోతున్నారు ఈమానవులు. ఈ మాటలను బట్టి మనం మూఢనమ్మకాలపై ధ్వజమెత్తవలసిన ఆవశ్యకత ఉందని తెలుస్తుంది. రాజుగారిని ప్రభాత్ కలిసి ప్రశ్నించినప్పుడు అనేక రాజకీయ మానవతావిలువలు వారి చర్చలో వెలువడుతాయి. రాజకీయం విశ్వాసంతో కూడినపని విశ్వాసవంతమైన నాయకుడికి అండదండలు కావాలని ప్రభాత్ అంటాడు. దీనిబట్టి ప్రజలుచేత ప్రజలు కొరకు ప్రజలే పరిపాలించుకునే ప్రభుత్వం ప్రజాస్వామ్యమని అరిస్టాటిల్ మాటలు గుర్తుకు చేసుకోవాలి ఈ నేపథ్యంలో  రాజకీయనాయకుడు ప్రజలలో ఎంతవిశ్వాసం కలిగిఉండాలో రచయిత తెలియచేస్తున్నారు.

కొంతమంది తమ వ్యక్తిగత స్వార్ధంతో రాజకీయాల లోనికివచ్చి అటు రాజకీయ సింహాసాన్ని, ఇటు సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. గోవిందరాజులు పాత్రవంటి వారిని రచయిత

ఉదాహరణలు ఇచ్చారు. దీక్షితులు వంటి సహృదయులు ప్రభావం ప్రభాత్ మీద పడుతుంది. నాలాంటివారు అన్యాయం చేయటమనే బురదలో కూరుకుపోయారు. మీరింకాఒడ్డున వున్నారు ప్రజల్లోకి వెళ్ళి వారి సమస్యలను అర్ధంచేసుకున్నప్పుడు మాత్రమే వారిని శాసించగలరని దీక్షితులు ప్రభాత్‌కి చెప్పారు. నేటికాలంలో రాజకీయ నాయకులు ప్రజలదగ్గరకి వచ్చి వారి సమస్యలను తెలుసుకునేది కేవలం ఎన్నికల రోజులలోను మాత్రమే ఎవరినైనా ప్రశ్నించడానికైనా దానికి తగ్గ అర్హత ఉండాలని ఈ నవల తెలుపుతుంది. ఒక ప్రశ్నకు ఎన్నోసమాధానాలు ఉండవచ్చు కాని సరైన జవాబు ఎంచుకోవటంలోనే మనిషి ప్రజ్ఞ కనబడుతుందని రచయిత ప్రభాత్ ద్వారామనకు సందేశం అందించారు.

అధికారం చేతికోస్తే దేముళ్ళే అయిపోయి రాజకీయనాయకులు ప్రజల సమస్యలను పరిష్కరించకుండా గుడ్డివారవుతారు లంచాలు ఇచ్చి ఉద్యోగాలు సంపాదించుకుంటారు. అటువంటివారు లంచాలు లేకుండా కంచాలు మేయరులంచగొండి తనంపై నిరశనవ్యక్తపరిచారు రచయిత. భూపతి కుటుంబం ద్వారా అగ్రకులస్థులు నాడు కులంబట్టి నేడు అంతస్థుల బట్టి మర్యాద పొందుతున్నరని సందేశం అందించారు. డబ్బుంటే ఆదినారాయణ వంటిస్మగులర్‌కి సమాజం విలువనిస్తుంది. కాని అటువంటి కలుపమొక్కలను సంఘం నుండి పికిపారియాలని ప్రభాత్ ద్వారా రచయిత చెప్పించారు. సమాజం అప్పిగాడి లాంటి అమాయకులను ఆదుకోవాలని ప్రభాత్ చెబుతాడు. రామిగాడు కొడుకు సత్తిగాడులా అన్యాయాన్ని ఎదించాలి. మంచి వారిని మిత్రులుగా చేసుకోవాలని రచయిత తెలిపారు.

కులభేదాలు చూపకూడదు అన్నదమ్ముల వలె మనం మెలగాలని రచయిత ప్రభోధించారు. పాతపద్ధతులకు స్వస్తిపలికి, కొత్త ఆలోచనకు తావు ఇవ్వమన్నారు ఆడపిల్లలకు చదువు చెప్పించమన్నారు. బదకానికి తావిస్తే దరిద్రంలో కూరుకుంటామని చినరంగడికి ప్రభాత్ ఉపదేశం ఇవ్వడం ద్వారా రచయిత సమాజానికి సందేశం అందించారు. కృషియే ప్రగతికి మెట్లని రచయిత తెలిపారు.

పేదవాడిని పట్టించుకోని రాజకీయం పేదవాడుని పట్టించుకోడు. ఉన్నవాళ్లు క్రూరత్వాన్ని లేనివాడి ఆకలి జ్వాలలే మంటలై విప్లవాన్ని తెచ్చి సమసమాజానికి బాటలు వేస్తాయి. రాజకీయం పవిత్రమైంది. ప్రతీరాజకీయ నాయకుడు నాదేశం నాప్రజలు నాజన్మభూమి అని నీతిపాటించే వాడు రాజకీయం నాయకుడు రావాలి. నేటి రాజకీయ నాయకులు అధికార దాహం విడిచిపెట్టి ప్రజల్లోనికి వచ్చి మానవసేవలో తరించాలి. అప్పుడే ఈ జన్మభూమిలో పుట్టినందుకు సార్థకత లభిస్తుందని బలివాడ కాంతారావు గారు విప్లవాత్మకమైన సందేశాన్ని అందించారు. ఈ విధంగా అనేక రాజకీయ మానవతా విలువలు ఈ నవలలో ఉన్నాయి. ఈ నవల నేటి తరం వారికి ఆదర్శవంతమైన విలువలు అందిస్తుంది. ఇటువంటి సందేశాత్మక రచనచేసిన బలివాడ కాంతారావుగారు ప్రజల హృదయాలలో చిరస్మరణీయులు.